క్లుప్తంగా

ఆర్ఎంపీల సమావేశం

రేపల్లె: పట్టణంలోని నయాగర ఫంక్షన్ హాలులో గురువారం ప్రాథమిక వైద్యుల(ఆర్ఎంపీ) సమావేశం గురువారం నిర్వహించారు. సదస్సులో గుంటూరుకు చెందిన చంద్ర న్యూరో కేర్ హాస్పిటల్ వైద్యులు ఎస్.శరత్‌చంద్ర పాల్గొని ఆర్ఎంపీలకు పలు సూచనలు చేశారు. కార్డియాలజిస్ట్ శివాజీ, ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షుడు దూళిపూడి రాఘవరావు, సభ్యులు కల్యాణ్, గోపీ, బ్రహ్మం, ఏడుకొండలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన బాపట్ల రూరల్ ఎస్ఐ కొండారెడ్డి



బాపట్లటౌన్: బాపట్ల రూరల్ ఎస్ఐగా కొండారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన తొలిసారిగా రేపల్లెలో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం చెరుకుపల్లి ఎస్ఐగా పనిచేసి, ప్రస్తుతం వీఆర్ నుంచి బాపట్ల రూరల్‌కు వచ్చారు. అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కూచిపూడి(వేమూరు): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మండల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు ఆర్.శరత్ గురువారం తెలిపారు. తెనాలి నుంచి అమర్తలూరు మండలానికి బియ్యం తరలిస్తున్న వాహనాన్ని.. కూచిపూడి వే బ్రిడ్జి వద్ద తనిఖీ చేసినట్లు చెప్పారు. అందులో 28 బస్తాల్లో రేషన్ బియ్యం గుర్తించడం జరిగిందని వెల్లడించారు. అమర్తలూరు పోలీసులకు సమాచారం అందించి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కూచిపూడి గ్రామంలోని డీలర్ దుకాణానికి బియ్యం తరలించినట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



భట్టిప్రోలు: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని ప్లాట్ ఫామ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. రేపల్లె నుంచి తెనాలి వెళ్తున్న ప్యాసింజర్ ట్రెయిన్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రేపల్లె జీఆర్పీ పోలీసులు గుర్తించారు. సమాచారం మేరకు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని తెనాలి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దంతలూరుకు చెందిన పల్లబోతు కోటేశ్వరరావు(48) బుధవారం సాయంత్రం బైక్‌పై తెనాలి వెళ్లి తిరిగి వస్తుండగా అత్తోట వద్ద ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని గుంటూరు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కొల్లిపర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు గురువారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 25 ఏళ్ల వయసున్న యువకుడు మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రైలు నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత రాజనీతి శాస్త్రశాఖాధిపతి ఎస్.తిరుపతయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు బోధనా పద్ధతుల్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని తదనుగుణంగా విద్యార్థుల్ని నవసమాజానికి అందించాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అని చెప్పిన అబ్దుల్ కలాం మాటలకు సార్థకత చేకూర్చాలని చెప్పారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఈ.చంద్రయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునెస్కో అక్టోబర్ 5ను అంతర్జాతీయ ఉపాధ్యాయులు దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. నేడు సుమారు 100 దేశాలు పాటిస్తున్నాయని తెలిపారు. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదని, సరైన ఉపాధ్యాయుడి దగ్గర కూడా అభ్యసించడం కూడా హక్కేనని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.వి సింగరయ్య ప్రసంగించారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

బాపట్ల: వైఎస్సార్ సీపీ పాలనలో ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని మూలపాలెం, పట్టణంలోని ఉప్పరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాలను ఎమ్మెల్యే సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. సరైన వైద్యశాల లేక తీవ్ర ఇబ్బందులు పడిన రోజుల నుంచి నిత్యం వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం..

సమ్మెటవారిపాలెం(కర్లపాలెం): ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. గురువారం సమ్మెటవారిపాలెంలో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు భరత్ సాగర్, శ్రీ మౌనిక, డాక్టర్ రమ్య పాల్గొని, సుమారు 370మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టు నాగాంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, డీపీవో దాసరి రాంబాబు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం.. ప్రభుత్వ లక్ష్యం

పిట్టలవానిపాలెం: ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం బాపట్ల అధ్యక్షురాలు యేత్ర అశ్వినిరెడ్డి అన్నారు. పిట్టువారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వినయ్, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్, డాక్టర్ మురళీ, డాక్టర్ లోకేష్, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ కిన్నెర, ఎంఎస్ ఆప్తామాలజిస్ట్ డాక్టర్ అశ్విత పాల్గొని, 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు శ్యామల నాగిరెడ్డి, ఎనుముల కోటేశ్వరరావు, బొలగాని సుబ్బారావు, మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గొరిగపూడిలో వైద్య శిబిరం

గొరిగపూడి(భట్టిప్రోలు): గొరిగపూడి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, ఎస్.కృపాసుమతి, రమాకాంత్, రాజేశ్వరి, కంటి వైద్య నిపుణురాలు అరుణరాణి (పీఎంవోఏ)లు వైద్య సేవలు అందించారు. 359 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ గరికపాటి మల్లిక, మండల ప్రత్యేక అధికారి జి. హనుమంతరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీటీసీ వరికూటి పున్నయ్య, పంచాయతీ కార్యదర్శి ఎండీ జిక్రియ, ఎంఈవో నీలం దేవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



దోనేపూడిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నేడు ఐలవరంలో వైద్య శిబిరం

భట్టిప్రోలు: ఐలవరం సచివాలయం-1 పరిధిలో శుక్రవారం పద్మశాలీయ కల్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

నేడు భవనంవారిపాలెంలో..

పిట్టలవానిపాలెం: భవనంవారిపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ డి.కోటిరెడ్డి, ఎంపీటీసీ సింధు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని, ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు

నేడు చాట్రగడ్డలో..

రేపల్లె రూరల్: చాట్రగడ్డ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివపార్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

పేదల పాలిట వరం

పిట్టలవానిపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పిట్టువారిపాలెం గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు ఆవరణంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ శిబిరాన్ని ప్రారంభించారు. మెడికల్ క్యాంప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 430 మందికి వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కమిషనర్ విజయసారథి, వార్డు కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. నల్లూరునార్త్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన వైద్య శిబిరంలో విశ్వేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు 238 మందికి వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీచరణ్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో వైద్య శిబిరం..

వేమూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. 236 మంది వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. డాక్టరు వెంకట సురేష్, డాక్టర్ రవళీ, కోటేశ్వరి, సంతోష్ రాయల్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నగరం: మండలంలోని ఉల్లిపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి సైదానాయక్ పర్యవేక్షించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 542 మందికి వైద్య పరీక్షలు చేసి, 23 మందిని మెరుగైన వైద్య సేవలకు రిఫర్ చేసినట్లు వైద్యులు వెల్లడించారు. తహసీల్దారు ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, డాక్టర్లు భవానీశ్రీ, తులసి రాజేశ్వరి, సీహెచ్‌వో బాబురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కొల్లూరు: నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల ప్రత్యేకాధికారి రమణ అన్నారు. దోనేపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాళ్లను పరిశీలించారు. వైద్యులు 454 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఈఓపీఆర్‌డీ రవిబాబు, వైద్యులు పావని, మౌనిక, వి.కావ్యతేజ, బి.రాజ్‌కుమార్, ఎస్. సుష్మ, ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజకుమారి, పంచాయతీ కార్యదర్శి దానయ్య పాల్గొన్నారు.



సమ్మెటవారిపాలెంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



గొరిగపూడిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న పీఎంవోఏ అరుణరాణి



పిట్టువారిపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వేమూరులో విద్యార్థికి వైద్య పరీక్ష చేస్తున్న వైద్యులు



రేపల్లె మెడికల్ క్యాంపులో వైద్యులు

నాణ్యమైన ఆక్వా వస్తువులనే విక్రయించాలి

జిల్లా మత్స్యశాఖ అధికారి సురేష్



రేపల్లె రూరల్: ఆక్వా దుకాణాల యజమానులు వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను మాత్రమే విక్రయించాలని బాపట్ల జిల్లా మత్స్యశాఖ అధికారి పి.సురేష్ అన్నారు. పట్టణంలోని పలు ఆక్వా దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. యజమానులు నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఆక్వా మందులు, మేతపై లేబుల్ సరిగా ఉండటం లేదని, లేబులింగ్ లేని మందులు, మేతను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నపాటి వస్తువుకైనా లేబులింగ్ విధిగా ఉండాలన్నారు. క్రయవిక్రయాలను రికార్డులలో విధిగా పొందుపరచాలన్నారు. బిల్లును తప్పని సరిగా అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.సైదా, రేపల్లె మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కుమారి కౌర్, గ్రామమత్స్య సహాయకులు పాల్గొన్నారు.

శ్రీసాయి ప్రసాదం సేవా సమితి అన్నదానం

తెనాలి: కలియుగంలో ధానధర్మాలు, నామస్మరణతోనే దేవుడిని ఆరాధించేందుకు ఆచరించాల్సిన ధర్మమని శ్రీకృష్ణ భగవానుడు ఏనాడో చెప్పారని, మన శాస్త్రాలు కూడా ఇదే చెబుతున్నాయని శ్రీసాయి ప్రసాదం సేవా సమితి వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను గురువారం చినరావూరు డొంక రోడ్డులోని మారుతి ఆలయంలో ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలోని 125 మందికి అన్నదానం చేశారు. పండగలు, పుట్టిన రోజులను పేదలతో జరుపుకుంటే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని చెప్పారు. జలుబుల తేజేష్ జన్మదినం సందర్భంగా జరిగిన ఈ వితరణలో విశ్రాంత ప్రభుత్వ అధికారి రమణయ్య, సురేష్, వెంకయ్య, దేవాలయ ధర్మకర్త దేశయ్య పాల్గొన్నారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు



తెనాలి అర్బన్: ఐటీఐ చదవడం వల్ల జీవనోపాధి త్వరగా దొరుకుతుందని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్ధార్థ ఐటీఐ వార్షికోత్సవ వేడుకల్ని అయితానగర్‌లోని కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవుల రాజేంద్ర ప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే బూత్‌లో చేర్చాలి



నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా జాబితాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలను నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి ఆదేశించారు. తన చాంబర్‌లో గురువారం ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజరీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో వారు అందించిన ఫిర్యాదుల్ని సూపర్‌వైజర్లు పరిశీలించి, సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో అందిన ఫారాల్ని అదనపు కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్ చేశామని చెప్పారు. పెండింగ్ ఫారాల ఆన్‌లైన్‌పై బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల ఆర్థిక, ఆరోగ్య భద్రతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- రాజవోలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, ఆర్థిక భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రాజవోలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన ఎంపీ మోపిదేవి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మర్రివాడ వెంకట పావని, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పైనం ఏడుకొండలురెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ తాతా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పీటా రాంబాబు, ఉప సర్పంచ్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రదర్శనలు అనుచితం

- కొనసాగితే హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చర్యలు
- కౌన్సిల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు



డీఎస్పీ ఆఫీసులో వినతిపత్రం ఇస్తున్న నాగరాజు

తెనాలి: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగే విధంగా విద్యార్థుల్ని రోడ్లపైకి తీసుకొచ్చి ప్రదర్శనలు చేయించడం అనుచితమైన చర్యగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనల్ని అడ్డుకొని, సమాజంలో హింస వాతావరణం చోటుచేసుకోకుండా పోలీసులు జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సంస్థ తరపున వినతిపత్రాన్ని గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని బూర్జువా పార్టీలు, విద్యార్థి సంఘాలు, కాలేజీల యాజమాన్యం వారి రాజకీయ కార్యకలాపాల కోసం విద్యార్థుల్ని వారి తల్లిదండ్రులకు తెలియకుండా ప్రదర్శనలకు వినియోగించడం తగదని ఖండించారు. విద్యార్థుల చదివే కాలాన్ని తగ్గించి, రాజకీయ నాయకులు వారి అవసరాలకు వాడుకుంటే హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరపున చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇలాంటి నిరసనల వల్ల అధికార పార్టీ మీద కోపంతోనే, ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా అల్లరిమూకలు అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఇలాంటి ప్రదర్శనలు, ర్యాలీలు అటు సాధారణ ప్రజలకు, విద్యార్థులకు నష్టమేనని అన్నారు. సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను రాజకీయ అవసరాలకు వాడుకోవడం తప్పుగా చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు మహేష్‌కుమార్, నాయక్, మరియదాసు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ మహిళా నేతల డిమాండ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలి అర్బన్: రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి ఆర్.రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ అత్తోట నాగమణి డిమాండ్ చేశారు. గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూరుకుపోయారని ఆరోపించారు. నేరం రుజువు కావడం వల్లే పోలీసులు అతడ్ని అరెస్ట్ చేసి జైలులో పెట్టారని చెప్పారు. కొందరు టీడీపీ నేతలు దాన్ని జీర్ణించుకోలేక మహిళా మంత్రులపై అనుచిత వాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళ విభాగం నేతలు గాలి అరవింద, బాలగురవమ్మ మాట్లాడుతూ టీడీపీ నాయకులకు మహిళలంటే చిన్న చూపు ఎక్కువన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులు అమల్లోకి వస్తున్నా వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో రెడ్డి రమణమ్మ, రావి ప్రశాంతి, జాకీరా, ఇందిరా ప్రియదర్శి, టి.ప్రశాంతి పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాతగుంటూరు:గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని కూల్‌డ్రింక్స్, బేకరీ దుకాణాల్లో ఆహార పదార్థాల్ని అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఏటీఎం సత్యనారాయణ వ్యాపారులకు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం బస్టాండ్‌లోని పలు దుకాణాల్ని ఆయన తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న నాలుగు దుకాణదారులకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఇకపై అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన బాలభీమసేన భీమయ్య గౌడ్ కుటుంబ సమేతంగా గతనెల 28న గుంటూరులోని భారత్‌పేట 9వ లైనులో నివసించే బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం ఆయన కుమారుడు రామాంజయ్య (22) బంధువులకు చెందిన మరో రేకుల గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి: ఎంపీ



పట్నంబజారు: పేదలకు మేలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. రింగ్ రోడ్డులోని ఆయన నివాసంలో గురువారం ఫుడ్ బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ ఆంధ్రప్రదేశ్ లోగో, టీషర్ట్‌ను ఆవిష్కరించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ స్వచ్ఛందంగా పేద ప్రజలకు సాయం చేయాలనే తలంపుతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ బ్యాంకు వ్యవస్థాపకురాలు రావెళ్ల భార్గవి, సాయి, శిరీష పాల్గొన్నారు.